క్లుప్తంగా

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

హుడాకాంప్లెక్స్: చెట్ల కొమ్మల తొలగింపు, మరమ్మతుల కారణంగా బుధవారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని సరూర్‌నగర్ డివిజినల్ ఇంజినీర్ కే రామకృష్ణ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 11కేవీ మదర్ డెయిరీ, ఆనంద్‌నగర్, ఆలిండియా రేడియో, కల్వంచ, శారదానగర్, ఎల్‌బీనగర్, సిరీస్, కొహెడ, తట్టిఅన్నారం ఫీడర్ల పరిధిలోని కాలనీల్లో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని తెలిపారు.

భక్తుల ఇలవేల్పు ఎల్లమ్మ తల్లి


ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

తుక్కుగూడ: మున్సిపల్ పరిధిలోని రావిర్యాల సూర్యగిరి ఎల్లమ్మ తల్లి భక్తుల ఇలవేల్పుగా మారింది. మంగళవారం అమ్మవారి దర్శనం కోసం భక్తులు క్యూ కట్టారు. మొక్కులు, కానుకలు చెల్లించుకున్నారు. సామూహిక సత్యానారాయణ స్వామి వ్రతాలు ఆచరించారు. అనంతరం భక్తులు అన్నప్రసాదం స్వీకరించారు. కార్యక్రమంలో ఆలయ ఫౌండర్ ట్రస్టీ చైర్మన్ రెడ్డిగళ్ల రత్నం, సిబ్బంది మీగడ కాశీనాథ్, పూజారులు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేత


లబ్ధిదారుడికి చెక్కు అందజేస్తున్న జెడ్పీటీసీ జంగారెడ్డి తదితరులు

కందుకూరు: మండల పరిధిలోని చిప్పలపల్లికి చెందిన ఎ.భారతమ్మకు సీఎంఆర్‌ఎఫ్ నుంచి మంజూరైన రూ.60 వేల చెక్కును మంగళవారం కందుకూరులో జెడ్పీటీసీ బొక్క జంగారెడ్డి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణలో అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ ఫలాలు అందాలనేదే ముఖ్యమంత్రి కేసీఆర్ ధ్యేయమని చెప్పారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి సర్పంచ్ బాలకృష్ణ, ఎస్టీ సెల్ నియోజకవర్గం అధ్యక్షుడు ఎస్.లచ్చానాయక్, ఎంపీటీసీ కాకి రాములు, నాయకులు కుమార్, జైపాల్‌రెడ్డి, రూప్‌చందర్ పాల్గొన్నారు.

ఆర్థిక సాయం


బాధిత కుటుంబానికి నగదు అందజేస్తున్న జంగయ్య తదితరులు

కందుకూరు: అనారోగ్యంతో బాధపడుతున్న మండల పరిధిలోని ఊట్లపల్లికి చెందిన బి.సురేశ్‌కు అండగా ఉంటామని మత్స్యకార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు జంగయ్య అన్నారు. మంగళవారం ఉస్మానియా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఆయన్ను పరామర్శించి, కుటుంబ సభ్యులకు రూ.10 వేల ఆర్థికసాయం అందించారు.

బస్టాప్‌లో ఆటోలు.. ప్రయాణికులకు పాట్లు


బస్టాప్‌లో పార్కు చేసిన ఆటోలు

హస్తినాపురం: నాగార్జునసాగర్ రోడ్డుకు ఇరువైపులా ఉన్న బస్టాపుల్లో ఆటోలను నిలుపుతూ ప్రయాణికులకు ఇబ్బందులు కలిగిస్తున్నా పట్టించుకునే నాథులే కరువయ్యారని ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సాగర్‌రింగ్ రోడ్డు, ఓంకార్‌నగర్, సంతోషిమాతనగర్‌కాలనీ, హస్తినాపురంచౌరస్తా సిగ్నల్, హస్తినాపురం సెంట్రల్‌కాలనీ, బీఎన్‌రెడ్డినగర్ ప్రాంతాలలో ఇష్టానుసారంగా ఆటోలను నిలుపుతున్నారని ట్రాఫిక్ పోలీసులు స్పందించి బస్టాపుల్లో నిలుపుతున్న ఆటోలపై దృష్టి సారించాలని కోరుతున్నారు.

మళ్లీ బీఆర్‌ఎస్‌దే అధికారం

- మహేశ్వరం గడ్డపై గులాబీ జెండా ఎగరడం ఖాయం
- మంత్రి సబితారెడ్డి


బడంగ్‌పేట్: బాలాపూర్ చెరువు వద్ద పర్యటిస్తున్న మంత్రి సబితారెడ్డి తదితరులు

మహేశ్వరం: వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో రాష్ట్రంలోనూ, మహేశ్వరం గడ్డపై మళ్లీ గులాబీ జెండా ఎగరడం ఖాయమని మంత్రి సబితారెడ్డి పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని మైలార్‌బాయి తండాకు చెందిన 40 మంది బీజేపీ కార్యకర్తలు బీఆర్‌ఎస్ సీనియర్ నాయకులు వీరానాయక్ అధ్యక్షతన మంత్రి సమక్షంలో ఆమె నివాసంలో బీఆర్‌ఎస్ పార్టీలో చేరారు. మంత్రి వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం సబితారెడ్డి మాట్లాడుతూ.. బీఆర్‌ఎస్ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలు నచ్చి బీజేపీ, కాంగ్రెస్, ఇతర పార్టీల నాయకులు, కార్యకర్తలు బీఆర్‌ఎస్‌లో చేరుతున్నట్లు తెలిపారు. నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తుంటే బీజేపీ నాయకులు అడ్డుకొని విమర్శించడం సిగ్గుచేటన్నారు. ఉప్పుగడ్డ తండా సమీపంలో రెండు ఎకరాల విస్తీర్ణంలో సంత్ సేవాలాల్ మహరాజ్, దుర్గమ్మ ఆలయాలు, బంజార భవన్ నిర్మిస్తున్నట్లు తెలిపారు. గిరిజనుల సంక్షేమమే లక్ష్యంగా బీఆర్‌ఎస్ ప్రభుత్వం పని చేస్తోందన్నారు. బీజేపీ, కాంగ్రెస్ పార్టీలను ప్రజలు నమ్మేస్థితిలో లేరన్నారు. మళ్లీ రాష్ట్రంలో, నియోజకవర్గంలో బీఆర్‌ఎస్ పార్టీకి పట్టం కడతారని ఆమె జోస్యం చెప్పారు. త్వరలో బీజేపీ, కాంగ్రెస్ పార్టీల నుంచి పలువురు బీఆర్‌ఎస్‌లో చేరుతారని తెలిపారు. కార్యక్రమంలో పార్టీ నియోజకవర్గ ఉపాధ్యక్షుడు హన్మగళ్ల చంద్రయ్య, మండల అధ్యక్షుడు అంగోత్ రాజునాయక్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ మునావత్ రవినాయక్, సీనియర్ నాయకులు అంధ్యా నాయక్, గంగారం గ్రామ అధ్యక్షుడు పాండు నాయక్, వార్డు సభ్యులు శ్రీనివాస్ పాల్గొన్నారు.

బాలాపూర్ చెరువు సుందరీకరణ

బడంగ్‌పేట్: బాలాపూర్ పెద్ద చెరువును అతి సుందరంగా తీర్చిదిద్దుతామని విద్యాశాఖ మంత్రి సబితారెడ్డి పేర్కొన్నారు. బడంగ్‌పేట కార్పొరేషన్ పరిధిలోని బాలాపూర్ పెద్ద చెరువు వద్ద కొనసాగుతున్న సుందరీకరణ పనులను మంగళవారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా సబిత మాట్లాడుతూ.. చెరువు సుందరీకరణ కోసం రూ.3.50 కోట్లు మంజూరు చేసినట్లు తెలిపారు. ఇందుకు సంబంధించిన పనులు వేగవంతంగా జరుగుతున్నాయని పేర్కొన్నారు. ఎఫ్‌టీఎల్ పరిధిలో ఎవరు కూడా పర్మినెంట్‌గా ప్రహరీలు, గోడలు, హద్దులు ఏర్పాటు చేయవద్దని కోరారు. బాలాపూర్ వాసులకు ప్రకృతి ఆనందాన్ని చెరువు కట్టపై కల్పించేందుకే సుందరీకరణ పనులు చేపట్టామని తెలిపారు. వాకింగ్ ట్రాక్‌తో పాటు చెరువు కట్టపై అన్ని మౌలిక వసతులు ఏర్పాటు చేస్తామన్నారు. గ్రామాలు పట్టణాలుగా, పట్టణాలు కాస్తా కాంక్రీట్ జంగిల్‌గా మారుతున్నాయని, అందుకే భవిష్యత్ తరాలను దృష్టిలో పెట్టుకుని బాలాపూర్ మండలంలోని అన్ని చెరువులను అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు. అల్మాస్‌గూడలోని కోమటికుంట చెరువు, పోచమ్మకుంట చెరువు, అలాగే మీర్‌పేట్ కార్పొరేషన్‌లోని సంజ చెరువు, మంత్రాల చెరువు, కుర్మల్‌గూడ, గుర్రంగూడ చెరువులకు కోట్ల రూపాయల నిధులు వెచ్చించామని వివరించారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ ఇబ్రాం శేఖర్, కార్పొరేటర్లు అర్జున్, పవన్, పి.శ్రీనివాస్‌రెడ్డి, ఏనుగు రాంరెడ్డి, బీఆర్‌ఎస్ పార్టీ అధ్యక్షులు రామిడి రాంరెడ్డి, సీనియర్ నాయకులు వంగేటి ప్రభాకర్‌రెడ్డి, పి.ఆనంద్‌రెడ్డి, కళ్లెం ఎల్లారెడ్డి, కోఆప్షన్ సభ్యుడు రఘునందన్‌చారి, మాజీ కౌన్సిలర్ గణేశ్, లిక్కి కృష్ణారెడ్డి, తిమ్మనిగిరి, బొర్ర మాధవరెడ్డి, బాలాపూర్ వాసులు పాల్గొన్నారు.

రైతుల అభ్యున్నతికి నిరంతర కృషి


క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న చైర్మన్ చంద్రశేఖర్ తదితరులు

కందుకూరు: రైతుల అభ్యున్నతి, సొసైటీ అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తున్నామని పీఏసీఎస్ చైర్మన్ చంద్రశేఖర్, వైస్ చైర్మన్ జి.విజేందర్‌రెడ్డి తెలిపారు. మంగళవారం మండల కేంద్రంలోని పీఏసీఎస్ కార్యాలయంలో కార్యవర్గ సమావేశాన్ని నిర్వహించారు. అనంతరం సొసైటీ నూతన క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రాచులూరు, గుమ్మడవెల్లి, నేదునూరుల్లో ఒక్కో గోదాం నిర్మాణానికి రూ. 38 లక్షల చొప్పున మంజూరైనట్లు తెలిపారు. దీర్ఘకాలిక అప్పులు తీసుకున్న రైతులు జనవరి చివరి నాటికి వాయిదాలు చెల్లించాలని, లేనిపక్షంలో అపరాధ రుసుం విధించాల్సి వస్తుందన్నారు. పంట రుణాలు తీసుకున్న రైతులు వడ్డీ చెల్లించి అసలు రెన్యూవల్ చేయించుకోవాలన్నారు. వడ్డీ చెల్లించిన వారికి 7 శాతం, చెల్లించని వారికి 13.75 శాతం వడ్డీ చెల్లించాల్సి ఉంటుందన్నారు. కార్యక్రమంలో డైరెక్టర్లు సురసాని శేఖర్‌రెడ్డి, నర్ల నర్సింహ, గౌర పర్వతాలు, గానుగుపేట అంజమ్మ, గౌర వెంకటేష్, కొర్వి యశోద, తీగల జగదీశ్వర్‌రెడ్డి, సాధ పాండు రంగారెడ్డి, పొట్టి ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి కనిపించడం లేదా ?

విపక్షాలకు బీఆర్‌ఎస్ నేతల ప్రశ్న


మాట్లాడుతున్న బీఆర్‌ఎస్ నాయకులు

మీర్‌పేట: మంత్రి సబితారెడ్డి కోట్ల రూపాయలు వెచ్చించి నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తుంటే ఆ పనులు ప్రతిపక్ష పార్టీలకు కనిపించడం లేదా అని బీఆర్‌ఎస్ నాయకులు ప్రశ్నించారు. మంగళవారం మీర్‌పేటలోని మంత్రి క్యాంప్ కార్యాలయంలో నియోజకవర్గ నాయకులు మాట్లాడారు. మంత్రి సబితారెడ్డి చెరువుల సుందరీకరణ, ప్రధాన రహదారుల విస్తరణ, మిషన్ భగీరథ ట్యాంకులు, నూతన పైపులైన్ నిర్మాణాలకు నిధులు మంజూరు చేసి పనులు చేపట్టారని తెలిపారు. అలాగే నూతనంగా ప్రభుత్వ జూనియర్, డిగ్రీ కళాశాలలను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. నియోజకవర్గంలో ఇంత అభివృద్ధి జరుగుతున్నా ప్రతిపక్షాలకు కనిపించడం లేదని, సోషల్ మీడియా ద్వారా తప్పుడు ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. కేంద్రం నుంచి ఎన్ని నిధులు తెచ్చారో బీజేపీ నాయకులు శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో బీఆర్‌ఎస్ నియోజకవర్గ ఉపాధ్యక్షులు హన్మగళ్ల చంద్రయ్య, లక్ష్మీనరసింహారెడ్డి, ప్రధాన కార్యదర్శులు బేర బాలకిషన్, అరవింద్ శర్మ, మీర్‌పేట మేయర్ ఎం దుర్గ, డిప్యూటీ మేయర్ తీగల విక్రంరెడ్డి, ఫ్లోర్ లీడర్ అర్కల భూపాల్‌రెడ్డి, మీర్‌పేట కార్పొరేషన్ అధ్యక్షుడు అర్కల కామేశ్‌రెడ్డి, మహేశ్వరం మండల అధ్యక్షుడు అంగోత్ రాజునాయక్, తుక్కుగూడ మున్సిపాలిటీ అధ్యక్షుడు లక్ష్మయ్య, మహేశ్వరం మార్కెట్ కమిటీ సురసాని సురేందర్‌రెడ్డి, కార్పొరేటర్లు పాల్గొన్నారు.

ప్రశ్నిస్తే అక్రమ కేసులా?

కార్పొరేటర్ ఆకుల శ్రీవాణి


మాట్లాడుతున్న కార్పొరేటర్ శ్రీవాణి

హుడాకాంప్లెక్స్: ప్రభుత్వాన్ని ప్రశ్నించినందుకే నాపై అక్రమ కేసులు బనాయిస్తున్నారని సరూర్‌నగర్ డివిజన్ కార్పొరేటర్ ఆకుల శ్రీవాణి అంజన్ కుమార్ అన్నారు. మంగళవారం తన నివాసంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. కేటీఆర్ ప్రధానమంత్రిని దూషించే భాషపైన ఫిర్యాదు ఇస్తే తెలంగాణ ఫ్రెండ్లీ పోలీస్ కేసు ఎందుకు నమోదు చేయలేదని ప్రశ్నించారు. కేటీఆర్ భాషతో నేను ప్రశ్నిస్తే మాత్రం నాపైన కేసు ఎందుకు పెడతారని ప్రశ్నించారు. కేటీఆర్ తెలంగాణ ప్రజలని, కేంద్ర ప్రభుత్వం గురించి తప్పుదోవ పట్టిస్తున్నందుకు సమాధానంగా కేటీఆర్ ఉపయోగించే భాషని ఆదర్శంగా తీసుకొని వారిని ప్రశ్నించినందుకు తనపై అక్రమ కేసులు పెడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సరూర్‌నగర్, పహాడీషరీఫ్ తదితర పోలీస్‌స్టేషన్‌లో నాపై పదికి పైగా కేసులు నమోదు కావడం దారుణమని అన్నారు. తనపై కేసులు పెట్టించే బదులు డివిజన్ అభివృద్ధిపై దృష్టి పెడితే మంచిదని కోరారు.

సీసీ కెమెరాలతో నేరాల అదుపు


సీసీ కెమెరాలను ప్రారంభిస్తున్న పోలీసులు, నాయకులు

తుక్కుగూడ: మున్సిపల్ పరిధిలోని ఒకటవ వార్డు దేవేందర్‌నగర్ కాలనీలో కౌన్సిలర్ బోధ యాదగిరిరెడ్డి సొంత నిధులతో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను మంగళవారం పహాడీషరీఫ్ సీఐ కిరణ్‌కుమార్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు బొక్క నర్సింహారెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... సీసీ కెమెరాల ఏర్పాటుతో నేరాలు అదుపులో ఉంటాయన్నారు. కెమెరాల ఏర్పాటుకు సహకరించిన కౌన్సిలర్‌ను అభినందించారు. కార్యక్రమంలో బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ అందెల శ్రీరాములు యాదవ్, మున్సిపల్ చైర్మన్ కే మధుమోహన్, కౌన్సిలర్, నాయకులు బోధ యాదగిరిరెడ్డి, వైశివకుమార్, బాకి విలాస్, సుధాకర్ శర్మ, వెంకటాచారి తదితరులు పాల్గొన్నారు.

మంత్రి సబిత చొరవతోనే అభివృద్ధి పనులు


అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న అఫ్జల్

పహాడీషరీఫ్: కోట్లాది రూపాయల వ్యయంతో జల్‌పల్లి మున్సిపాలిటీని మంత్రి సబితా ఇంద్రారెడ్డి అభివృద్ధి చేస్తున్నారని మాజీ ఎంపీటీసీ సభ్యుడు షేక్ అఫ్జల్ అన్నారు. వాదే ముస్తఫా బస్తీలో కొనసాగుతున్న అభివృద్ధి పనులను మంగళవారం ఆయన పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ.. మున్సిపాలిటీలోని 28 వార్డులలో కోట్లాది రూపాయలతో బాక్స్ డ్రైన్, సీసీ, బీటీ రోడ్ల పనులు సాగుతున్నాయన్నారు. అయినా కొంత మంది రాజకీయ విమర్శలు చేస్తుండడం సిగ్గుచేటని అన్నారు.

చైనా మాంజాలు స్వాధీనం

హస్తినాపురం: వనస్థలిపురం పోలీస్‌స్టేషన్ పరిధిలో నిషేధిత చైనా మాంజాలను విక్రయిస్తున్న దుకాణాలపై దాడులు చేసి మాంజాలను స్వాధీనం చేసుకుని కేసులు నమోదు చేసినట్లు సీఐ సత్యనారాయణ వెల్లడించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చైనా మాంజాలతో ద్విచక్రవాహనాలపై ప్రయాణించే వారి మెడకు చుట్టుకుని మరణించడం, గాయపడిన సంఘటనలు గతంలో చోటు చేసుకున్నాయని ఇలాంటి వాటిని విక్రయించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటున్నామన్నారు.

క్రీడాకారులను ప్రోత్సహించాలి


వాలీబాల్ పోటీలను ప్రారంభిస్తున్న సర్పంచ్

కందుకూరు: చదువుతో పాటు క్రీడలు ఎంతో ముఖ్యమని అన్నోజిగూడ సర్పంచ్ కాకి ఇందిర అన్నారు. మంగళవారం మండల పరిధిలోని గూడూరు ఎంపీటీసీ పరిధిలోని గ్రామాలన్నింటికి కలిపి అన్నోజిగూడలో వాలీబాల్ టోర్నమెంట్‌ను ఏర్పాటు చేశారు. ఆ పోటీలను ఆమె ప్రారంభించి మాట్లాడారు. క్రీడల్లో రాణిస్తే క్రీడాకారుల కోటాలో సైతం ప్రభుత్వ ఉద్యోగాలు పొందే అవకాశం ఉందన్నారు. తల్లిదండ్రులతో పాటు అందరూ క్రీడాకారులను ప్రోత్సహించాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో వార్డు సభ్యులు మహేందర్, గణేష్, జి.రామకృష్ణ, ఎడ్ల కృష్ణ, లక్ష్మణ్, రఘురాం రాథోడ్, పాఠశాల చైర్మన్ మహేందర్, శివకుమార్, సుధాకర్, మల్లేష్, సాయి, చింటు, కిరణ్ పాల్గొన్నారు.

కౌన్సెలింగ్‌లోనే పదోన్నతులు కల్పించాలి


మంత్రి సబితారెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న సంఘం నాయకులు

హుడాకాంప్లెక్స్: తమ సమస్యలు పరిష్కరించాలని వ్యాయామ విద్య ఉపాధ్యాయ రాష్ట్ర సంఘాల ఆధ్వర్యంలో మంగళవారం మంత్రి సబితారెడ్డిని కలిసి విన్నవించారు. అప్ గ్రేడేషన్ అయిన 1849 పోస్టులకు కామన్ సీనియారిటీ 11, 12 జీవోల ప్రకారం బీపీఈడీ విద్యార్హతలు ఉన్న అందరినీ కలుపుకుని స్కూల్ అసిస్టెంట్ వ్యాయామ విద్యా ఉపాధ్యాయులుగా జరగబోయే పదోన్నతుల కౌన్సిలింగ్‌లోనే పదోన్నతులు కల్పించాలని అభ్యర్థించినట్లు రాఘవరెడ్డి తెలిపారు. మంత్రి సానుకూలంగా స్పందించారని, సమస్య పరిష్కారమయ్యే విధంగా పదోన్నతులలో అవకాశం కల్పించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారని తెలిపారు. కార్యక్రమంలో పేటా టీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు రాఘవరెడ్డి, ప్రధాన కార్యదర్శి కృష్ణమూర్తిగౌడ్, టీజీ పేటా అధ్యక్షుడు విజయసాగర్, ప్రధాన కార్యదర్శి సుధాకర్‌రెడ్డి, పేటా టీఎస్ గౌరవ అధ్యక్షుడు సోమేశ్వర రావు, నల్లగొండ జిల్లా శాఖ అధ్యక్షుడు జై చంద్రయ్య, కోశాధికారి నాగరాజు పాల్గొన్నారు.

సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి

- తెలంగాణ ఉద్యమకారుల ఫోరం డిమాండ్
- ఇబ్రహీంపట్నంలో నియోజకవర్గ స్థాయి సమావేశం

ఇబ్రహీంపట్నం రూరల్: తెలంగాణ ఉద్యమంలో ప్రాణాలు లెక్కచేయకుండా పోరాటాలు చేశాం. నీళ్లు, నిధులు, నియామకాల కోసం గళమెత్తాం. ఇన్ని పోరాటాలు చేసి సాధించుకున్న స్వరాష్ట్రంలో నేడు అనుకున్న మేర ఫలాలు దక్కటం లేదని తెలంగాణ ఉద్యమకారుల ఫోరం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు యాదిరెడ్డి, వీరేశ్‌కుమార్ విమర్శించారు. ఇబ్రహీంపట్నం డాగ్ బంగ్లాలో మంగళవారం నియోజకవర్గ స్థాయి ఉద్యమకారుల సమావేశం జరిగింది. ఈ సమావేశంలో వారు మాట్లాడుతూ... నాటి ఉద్యమంలో పాల్గొని అన్ని రకాలుగా నష్టపోయాం. అయితే నాడు తెలంగాణ ఉద్యమాన్ని వ్యతిరేకించిన వాళ్లే నేడు అధికారం చెలాయిస్తున్నారు. నిజమైన తెలంగాణ ఉద్యమకారులకు గుర్తింపు లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఉద్యమకారుల సంక్షేమం కోసం కృషి చేయాలని కోరారు. తెలంగాణ ఉద్యమకారులకు సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలని, సంక్షేమ పథకాల్లో 20 శాతం అవకాశాలు కల్పించాలి, ఉచిత బస్‌పాస్ సౌకర్యం కల్పించాలని కోరారు. రైతుబంధు పథకాన్ని 5 ఎకరాల్లోపు ఉన్న రైతులకే వర్తింపజేసి, మిగితా డబ్బులను ఉద్యమకారుల సంక్షేమ కోసం ఖర్చుచేయాలని డిమాండ్ చేశారు. దళితబంధు పథకంలో ప్రాధాన్యత కల్పించాలని.. నిరుపేద కుటుంబాలను చెందిన వారికి గ్రామాల్లో ఎకరా వ్యవసాయ భూమిని పంపిణీ చేయాలన్నారు. రూ.5 వేల పింఛన్‌ను అందజేయాలని డిమాండ్ చేశారు. అనంతరం అంబేడ్కర్ విగ్రహం ఎదుట నిరసన తెలిపారు. ఈ సమావేశంలో సంఘం రాష్ట్ర కన్వీనర్ వెంకటేశంగౌడ్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు విష్ణువర్ధన్, నాయకులు కారింగ్ నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

డ్రైనేజీ సమస్యలు పరిష్కరించాలి

బీజేపీ నేత ధీరజ్‌రెడ్డి


ఎన్టీఆర్‌నగర్‌లో డ్రైనేజీ సమస్యను పరిశీలిస్తున్న బీజేపీ నేత ధీరజ్‌రెడ్డి

దిల్‌సుఖ్‌నగర్: ఆర్‌కేపురం డివిజన్ పరిధిలోని ఎన్టీఆర్‌నగర్ ఫేస్–2లో డ్రైనేజీ లైన్, వాటర్‌లైన్ సమస్యలను పరిష్కరించాలని బీజేపీ మహేశ్వరం నియోజకవర్గ సీనియర్ నేత ధీరజ్‌రెడ్డి జలమండలి అధికారులకు సూచించారు. మంగళవారం ఎన్టీఆర్ నగర్ ఫేస్‌లలో ఆయన పర్యటించి కాలనీలోని పలు సమస్యలను పరిశీలించారు. రోజూ డ్రైనేజీ లైన్ లీకేజీతో ఇబ్బందులు పడుతున్నామని స్థానికులు వాపోయారు. వాటర్ పైపు లీకేజీ జరగడంతో నీళ్లల్లో డ్రైనేజీ కలవడంతో వారు నిరంతరం వ్యాధుల భారినపడుతున్నారన్నారు. బీజేపీ ఆర్‌కేపురం అధ్యక్షుడు రాములుయాదవ్, నాయకులు సతీష్, నర్సింహ, కృష్ణ పాల్గొన్నారు.

మామిడిలో పూత, కాత నిలవాలంటే..

- యాజమాన్య పద్ధతులు తప్పనిసరి
- కృషి విజ్ఞాన్ కేంద్రం క్రిడా నిపుణుడు శ్రీకృష్ణ




పూత దశలో మామిడి తోట

కందుకూరు: రంగారెడ్డి, వికారాబాద్ జిల్లాల్లో మామిడి పంట సాగు అధికంగా ఉంది. ఈ రెండు జిల్లాల్లో 12వేల ఎకరాలల్లో మామిడి పంటను సాగు చేస్తున్నారు. కాగా ఒక ఏడాది పూత బాగా వస్తే, మరో ఏడాది సక్రమంగా రాదు. దీంతో రైతులు ఆశించిన మేర పంట దిగుబడి పొందలేక నష్టపోతున్నారు. పూత సకాలంలో రావాలన్నా, వచ్చిన పూత రాలకుండా ఉండాల న్నా, కాతను కాపాడుకోవాలన్నా సరైన యాజ మాన్య పద్ధతులు పాటించాలని కృషి విజ్ఞాన్ కేంద్రం క్రిడా నిపుణుడు జీ శ్రీకృష్ణ సూచిస్తున్నారు. రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, సస్యరక్షణ చర్య లను గురించి పలు సలహాలు, సూచనలు అందించారు.

ఎదిగిన మామిడి తోటల్లో..

మామిడి పంట సాగులో జూన్ నుంచి అక్టోబర్ నెల వరకు రైతులు పాటించిన సమగ్ర సాగు పద్ధతులను బట్టి అక్టోబర్, నవంబర్ మాసాల్లో ముదిరిన రెమ్మల్లో పూ మొగ్గ ఏర్పడడం జరుగుతుంది. ఆయా రకం, లేదా వాతావరణ పరిస్థితులను బట్టి కొన్ని ప్రాంతాల్లో డిసెంబర్ రెండో పక్షం, జనవరి మొదటి వారంలో పూ మొగ్గలు రావడం మొదలవుతాయి. ఒక్కోసారి చలి బాగా ఉంటే పూ మొగ్గలు ఆలస్యంగా కనిపిస్తాయి. పూ మొగ్గలను ఉత్తేజ పరిచి తొందరగా పూత తెప్పించడానికి డిసెంబర్ 15 నుంచి 30వ తేదీల మధ్య కొన్ని పద్ధతులు పాటిస్తే పూత త్వరగా బయటికి వచ్చేలా చేయవచ్చు.

త్వరగా పూత రావాలంటే...

నీటి వసతి ఉన్న తోటల్లో తేలికపాటి తడి ఇవ్వాలి లీటరు నీటికి పొటాషియం నైట్రేట్ (సురేకారం లేదా మల్టీ – కె లేదా ఫెర్టిమాక్స్) 10 గ్రాములు, యూరియా 5 గ్రాములు చెట్టుపై పిచికారీ చేయడం ద్వారా పూ మొగ్గలు త్వరగా ఒకేసారి చిగురిస్తాయి. బోరాన్ లోపం ఉన్న తోటల్లో పూత బాగా వచ్చినా ఫలదీకరణ సరిగా జరగకపోవడంతో పిందె సరిగ్గా ఏర్పడదు. బోరాన్ లోపాన్ని సవరించి, పిందె కట్టు పెంచడానికి పూ మొగ్గలు రాకముందు బొరాక్స్ లేదా సాల్యుబోర్ లేదా బోరాన్ -19 లీటర్ నీటికి 2 గ్రాములు కలిపి పిచికారీ చేయాలి.

నీటి యాజమాన్యం

- కాయ పెరిగే దశలో సరైన నీటి యాజమాన్యం పాటిస్తే కాయ పరిమాణం పెరిగి నాణ్యత దెబ్బ తినకుండా ఉంటుంది.
- పిందె చిన్నగా గోళీ అంత పరిమాణంలో ఉన్నప్పుడు పాదుల్లో నీరు పెట్టాలి.
- భూమి స్వభావం వాతావరణ పరిస్థితులను బట్టి పాదుల్లో 4 అంగుళాల లోతులో పదును ఉండేలా తడులివ్వాలి.
- కాయ నాణ్యత పెంచడానికి, కాయ కోతకు 20 నుంచి 30 రోజుల ముందు తడులివ్వడం ఆపాలి. దీంతో కాయలు ముదిరి పాకానికి వస్తాయి.
- నీటి వసతి లేని తోటల్లో కాయ పెరుగుదలను పెంచడానికి లీటర్ నీటికి 15 గ్రాములు యూరియాను కాయలు అంగుళం పరిమాణానికి ఎదిగినప్పుడు పిచికారీ చేయవచ్చు.

పోషకాల యాజమాన్యం

మామిడి కాయలు అంగుళం పరిమాణం నుంచి భూజాలు ఏర్పడేంత వరకు చాలా త్వరగా పెరుగుతాయి. ఈ సమయంలో పోషకాలు ముఖ్యంగా నత్రజని, పొటాషియం అవసరం ఎక్కువగా ఉంటుంది. నీటి వసతి గల తోటల్లో చెట్టుకి ఒక కిలో యూరియా, కిలోలో మూడో వంతు మ్యూరేట్ ఆఫ్ పొటాష్‌ను పిందెలు బాదంకాయ పరిమాణంలో ఉన్నప్పుడు వేసి నీరు పెట్టాలి. అమినోస్ లేదా విపుల్ లేదా బయోవిటా లేదా బయోజైమ్ లీటర్ నీటిలో కలిపి కాయలపై పిచికారీ చేసి కాయ సైజు, దిగుబడి, నాణ్యతను పెంచవచ్చు. సున్నం లోపం ఉన్నప్పుడు కాయల కొన దగ్గర కణజాలం ఎర్రబారుతుంది. దీని నివారణకు లీటర్ నీటికి 5 నుంచి 7 గ్రాముల హైడ్రో కాల్షియం నైట్రేట్ లీటరు నీటితో కలిపి కాయలపై పిచికారీ చేయాలి.